నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబ శివరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ మహంకాళి ఫీడర్ పరిధిలో మహంకాళి దేవాలయం రోడ్డు, జ్యోతికాలనీ, భజరంగ్‌నగర్, సీపీఐకాలనీ, రావినారాయణరెడ్డి కాలనీ, ఎకే.ఎన్‌క్లేవ్, కల్యాన్‌సులోచన, శ్రీరామకాలనీ, విఘ్నేశ్వరకాలనీ, భద్రయ్య వెంచర్, శివాజీనగర్ ఫీడర్ పరిధిలో కేసీఆర్ మార్కెట్, సంతోష్ నగర్, సుక్కమ్మకాలనీ, శివాజీనగర్, సుభద్రమ్మ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పోచారం: సమాజంలో జరుగుతున్న పలు నేరాలపై ప్రతాపసింగారంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పోలీసులు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్, లైంగిక వేధింపులు, బెగ్గింగ్, సైబర్ క్రైమ్స్, ట్రిపుల్ రైడింగ్, డ్రగ్స్ వినియోగం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎస్‌ఓటీ ఎస్సై వెంకట్ శ్రీను, ఏఎస్సై శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


నాగారం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

కీసర: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలో రాంపల్లి–ఘట్‌కేసర్, లక్ష్మీ నగర్, నాగారం ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను టీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ నిర్మాణాలకు టీజీబీపాస్, కమర్షియల్ నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలన్నారు. లేదంటే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఓ కమర్షియల్ భవనాన్ని బకాయిలు చెల్లించని కారణంగా సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగమణి ఆదేశాల మేరకు గురువారం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కమిషనర్ నాగమణి మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో గృహ సముదాయాలు, కమర్షియల్ భవనాలు ఉన్న వారు తప్పకుండా సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు. మేనేజర్ వెంకటేశం, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో కాంగ్రెస్ సంబరాలు


అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాల్లో కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: అసెంబ్లీలో ప్రభుత్వం కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదించడంతో మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులగణన, ఎస్సీవర్గీకరణ బిల్లులు ఆమోదించడం చారిత్రాత్మకమని నాయకులు ప్రశంసించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, రవిముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, ప్రకాష్‌రెడ్డి, కౌడె మహేష్, రమేష్, కరుణాకర్ రెడ్డి, వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు కీసర ముస్తాబు


దేవస్థానం గోపురానికి రంగులు వేస్తున్న దృశ్యం


కీసరగుట్ట దేవాలయ ప్రాంగణం

కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు తరలివచ్చే లక్షలాది మంది యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం, జిల్లా యాంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 24 నుంచి మార్చి 1వరకు జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు సుమారు 6 నుండి 7 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఏర్పాట్లకు సంబంధించిన ఆదేశాలు అధికారులు జారీ చేయడంతో పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఏర్పాట్లకు తగిన సూచనలు చేసిన విషయం విధితమే.

ఏర్పాట్లు ఇలా...

కీసరగుట్ట ప్రధాన ఆలయం వద్ద ఇప్పటికే క్యూలైన్లు సిద్ధమౌతున్నాయి. గతంలో స్వామిదర్శనం కోసం 5 క్యూలైన్లు ఏర్పాటు చేస్తే.. ఈసారి 6 క్యూలైన్లు ఏర్పాటు చేసి 3 క్యూలైన్లు సామాన్య భక్తుల కోసం ఏర్పాటు చేశారు. దీంతో ఉచిత దర్శనం కోసం క్యూలైన్లలో ఉండే భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది.

ఆకర్షణీయంగా రంగులు..

ప్రధాన ఆలయంతో పాటు మహామండపం, రాజగోపురాలు, ఆంజనేయస్వామి విగ్రహానికి రంగులు వేసే పనులు కూడా కొనసాగుతున్నాయి.

ఇక కీసరగుట్ట ప్రధాన దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం తదితర ప్రాంతంలో భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్ల ఏర్పాట్లు కూడా కొనసాగుతున్నాయి.

చెట్ల కొమ్మల తొలగింపు..

ఇక విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రహదారుల వెంట విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు దాదాపు పూర్తయ్యాయి. జాతర జరిగే ప్రాంతంలో అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు త్వరలోనే ప్రారంభిస్తామని విద్యుత్ ఏఈ మురళికృష్ణ తెలిపారు.

వంటశాలకు శాశ్వత షెడ్డు..

లడ్డూప్రసాదాలు తయారీకి ప్రతి ఏటా తాత్కాలికంగా వంటశాల ఏర్పాటు చేసేవారు. ఈసారి వంటశాలకు కుడా పర్మనెంట్‌గా షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు కుడా కొనసాగుతున్నాయి.

రూ.1.50 కోట్ల నిధుల కేటాయింపు..

బ్రహ్మోత్సవాలకు సుమారు రూ. కోటిన్నర వరకు నిధులను ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు సమాచారం. శీఘ్ర దర్శనం, అభిషేకం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో టిక్కట్లు ఉంటాయి. భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్‌చేసుకుని సమయానికి వచ్చి స్వామిదర్శనం చేసుకునేలా దేవస్థానం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

24 గంటలు అన్ని సౌకర్యాలు..

జాతర జరిగే రోజుల్లో 24 గంటల పాటు భక్తులకు తాగునీరు, నిత్యావసరాలకు కావాల్సిన నీటిని సరఫరా చేసేలా మిషన్ భగీరథ అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. 24గంటలు పారిశుద్ధ్య కార్మికులతో దేవాలయ ప్రాంగణం, జాతర జరిగే పరిసర ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టనున్నారు.

వాహనాల పార్కింగ్‌కు..

ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు, భారికేడ్లు ఏర్పాట్లు చేయనున్నారు. 24 గంటలపాటు అంబులెన్స్‌లతో పాటు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

- తామర కొలను దగ్గర గజ ఈతగాళ్లను మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు.
- వివిధ ప్రాంతాల నుంచి యాత్రికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు సుమారు 400 నుంచి 800 వరకు ప్రత్యేక బస్సులు నడిపేలా తగిన చర్యలు చేపడుతున్నారు.

సైన్ బోర్డుల ఏర్పాటు..

వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా వై జంక్షన్ నుంచి దేవాలయం వరకు ఉచిత ఆటోలు, షెటిల్ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికక్కడే సైన్‌బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సుమారు 1700 నుంచి 2000 వేల మంది పోలీసులతో తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని శాఖల సమన్వయం కోసం సమీకృత కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి జాతరను విజయవంతం చేసేలా అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు.

15 లోగా ఏర్పాట్లు పూర్తి చేస్తాం



ఈనెల 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ఎండోమెంట్ మినిస్టర్, అధికారులు, ఇన్‌చార్జ్ మినిస్టర్ వివిధ శాఖల అధికారుల సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం.

– తటాకం నారాయణ, ఆలయ చైర్మన్

10న ఐటీఐలో జాబ్‌మేళా

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హనుమాన్‌నాయక్ తెలిపారు. పీఎంఎస్‌ఎంఎం పథకం ద్వారా మేళా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేళాలో మహీంద్ర, సచెందర్, ఇంజిన్‌వాల్స్, ఫెనెస్టా, మెఘా ఇంజినీరింగ్, రాక్వెల్ వంటి కంపెనీలు పాల్గొననున్నాయి. అన్ని కంపెనీల్లో అప్రెంటిసిస్ కోసం 800 పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


షేక్ దావత్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి అత్వెల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన షేక్ దావత్ (22) కుటుంబం బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితం అత్వెల్లికి వలస వచ్చారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న దావత్ వారం రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వచ్చి, తిరిగి ఇంటికి వెళ్లలేదు. కాగా గతంలో చాలాసార్లు అతడు ఇంట్లో చెప్పకుండా వెళ్లే అలవాటు ఉండటంతో కుటుంబసభ్యులు అలాగే వస్తాడని భావించారు. గురువారం ఉదయం అత్వెల్లిలో జాతీయ రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న భవనంలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మూడు రోజుల క్రితమే అతడు మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మరో కోణంలో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య లేక హత్య అనే కోణంలో అనుమానిస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి


ఆసుపత్రి ఎదుట నిరసన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఘట్‌కేసర్: ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పెండింగ్ వేతన బకాయిలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి 4 నెలలుగా వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి ఆసుపత్రి సూపర్‌నెట్ ద్వారా సిబ్బందికి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నుంచి ప్రతిరోజు గంటపాటు ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు భాగ్యమ్మ, శివమ్మ, ఊర్మిల, కృష్ణబాధియా, బాలమ్మ, పుష్ప, నాగమ్మ, మెహ్రూన్నీసా, స్వరూప, ప్రేమలత, అజయ్ పాల్గొన్నారు.

ఆత్మీయ అభినందన సభ



కీసర: నాగారం మున్సిపల్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులోని ఎస్వీనగర్‌లోని సాయి అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద స్థానికులు ఇటీవల పదవీకాలం ముగిసిన మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు అనితాసుధాకర్‌రెడ్డి, గూడురు సబితాఆంజనేయులుగౌడ్, రేణుకాజగన్మోహన్‌రెడ్డి, సుమిత్రాసురేష్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌లను ఘనంగా సత్కరించారు. గోపాల్‌రెడ్డి, నర్సింహ్మగౌడ్, సత్యంరాజు, కాలనీల అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

- మంత్రి సీతక్క చొరవతో కదిలిన యంత్రాంగం
- నాలా బఫర్‌జోన్లపై ఇరిగేషన్ అధికారుల సర్వే


చర్లపల్లి ఇందిరా గృహకల్పలో ప్రీకాస్ట్‌ను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు


వివరాలు సేకరిస్తున్న అధికారులు

కుషాయిగూడ: చర్లపల్లి ఇందిరాగృహకల్ప కాలనీలోని కబ్జాలపై కాప్రా రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. చర్లపల్లి కబ్జాలపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు ప్రేమ్‌కుమార్ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్ యంత్రాంగం గురువారం ఇరిగేషన్ ఏఈ సుధీర్, కాప్రా రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, సర్వేయర్ మహేందర్ ఇందిరా గృహకల్ప కాలనీని సందర్శించారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలతో నేలమట్టం చేశారు. సెప్టిక్‌ట్యాంకుల స్థలంలో ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ ప్రహరీని తొలగించారు. సదరు స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

- నేతాజీనగర్‌లో నాలా పరివాహక ప్రాంతం బఫర్‌జోన్‌లో నిర్మించిన నిర్మాణాలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారు. త్వరలోనే ఆ నిర్మాణాలను కూడా తొలగిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణతో అందరికీ సమన్యాయం

మౌలాలి : కేవలం సామాజిక సమానత్వం కోసం వర్గీకరణ ప్రజాస్వామ్యంలో అందరికీ సమన్యాయం జరగాలనే ఉద్దేశంతో నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపారు. 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ పోరాటానికి మద్దతు తెలపడం అభినందనీయమని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్ యాదవ్ పేర్కొన్నారు. అనంతరం ఆమె పార్టీ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో వర్గీకరణకు మద్దతుగా సమావేశం నిర్వహించారు. నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, శివగౌడ్, నవీన్, కరుణశ్రీ, శ్రీనివాస్‌యాదవ్, రాధా, అనీల్, నటరాజ్, అలివేలు, సుజాత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రామంతాపూర్ : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో వెంకటరెడ్డినగర్‌లోని సత్యసాయి విద్యాసంస్థలు నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలను మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్, కార్పొరేటర్ చేతనాహరీష్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొంది రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. యశ్వంత్, సుధాకర్, రాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


వర్ష

మల్కాజిగిరి: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ యువతి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వీణాపాణినగర్‌కు చెందిన గొల్లపల్లి ఆశిష్ కుమార్ రైల్వే ఉద్యోగి. అతడి సోదరి గొల్లపల్లి వర్ష (35) మానసిక స్థితి గత కొంతకాలంగా సరిగ్గా లేదు. దీంతో ఈనెల 5న ఇంటి దగ్గరలోని గుడికి వెళ్లి తిరిగి రాలేదు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేముల కేశవనాథంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం సిరిసూకల్‌లో కంటిపరీక్షల వైద్య శిబిరాన్ని డాక్టర్ అమర్నాథ్ ఐ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన లయన్ చందనకు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ శారద, దుర్గ, పల్లె బాలరాజ్‌గౌడ్, అరుణ, శ్రీలత, నిర్మల, వెంకటేష్‌గౌడ్, రంగన్నగౌడ్, సురేందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, దేవి, రాజేశ్వరి, ఆసుపత్రి సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో కొనసాగుతున్న ఆర్‌సీసీ పైపులైన్ పనులను గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. గౌతంనగర్ డివిజన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. నాయకులు మేకల రాముయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


ఘట్‌కేసర్‌లో పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఘట్‌కేసర్: అసెంబ్లీలో బీసీ కులగణన సర్వే తీర్మానాన్ని ఆమోదం తెలిపినందుకు కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ కులగణన చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ వెంకటేష్‌ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు మల్లేష్, రవీందర్, నాయకులు జంగయ్యయాదవ్, మాధవరెడ్డి, జంగయ్యముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, అంజిరెడ్డి, సత్తిరెడ్డి, నర్సింగ్‌రావు, ఫరూక్, రాంరెడ్డి, శ్రీనివాస్, ఖయూమ్, రఫీయుద్దీన్, నరసింహరాజు, అనిల్, కిరణ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు ఫిర్యాదు చేసిన రెడ్డి సంఘం సభ్యులు


ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం సభ్యులు


ఘట్‌కేసర్: రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ (తీన్మార్ మల్లన్న) చింతపండు నవీన్‌పై రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. రెడ్డి కులాన్ని దూషిస్తూ.. అతడు అవహేళన చేశాడని, అసభ్య పదజాలంతో రెడ్డి జాతి మనోభావాలను దెబ్బతీశాడని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చుపెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శివప్రదీప్‌రెడ్డి, సంజీవరెడ్డి, విక్రాంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, పురుషోత్తంరెడ్డి, సంజీవరెడ్డి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి, సత్తిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నరసింహ్మారెడ్డి ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో విద్యార్థులకు శిక్షణ పూర్తి


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అల్వాల్: ఓయూ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంపార్టింగ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ అండర్ గ్రాడ్యుయేట్ ట్రైబల్ స్టూడెంట్స్ ఫర్ తెలంగాణ' కార్యక్రమానికి మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు వాణి, శిరీషలు హాజరై శిక్షణ పూర్తి చేసుకున్నారు. గురువారం శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలోని డిగ్రీ కళాశాల గిరిజన విద్యార్థుల కోసం తొలిసారి నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి కేవలం మల్కాజిగిరి డిగ్రీ కళాశాల విద్యార్థులు మాత్రమే ఎంపికై, విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నారన్నారు. ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తాయని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ బ్రిజేష్, వైస్ ప్రిన్సిపాల్ అడవిరాజు, హరిత, అధ్యాపకులు రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కాలనీని ఉద్యానవనంగా చేస్తాం


చిలుకానగర్ డివిజన్‌లో పార్కులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

ఉప్పల్: ప్రతి కాలనీలో ఒక ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ఉద్యానవనాలను ఎల్‌బీనగర్ జోన్ హార్టికల్చరల్ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణతో కలిసి పరిశీలించారు. పార్కులను సుందరీకరించాలని, అవసరమైన చోట్ల బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు చిల్డ్రన్స్ పార్కులను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై అధికారి అన్నపూర్ణ హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, శ్యామ్, బాలాజీఎన్‌క్లేవ్ సలహాదారుడు వేణుగోపాల్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.